క్లుప్తంగా

సీఎంగా రేవంత్‌రెడ్డి ఎంపికపై హర్షం

దేవరుప్పుల: కాంగ్రెస్ పార్టీ పూర్వవైభవం కోసం పాటుపడిన టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిని తెలంగాణ సీఎంగా ఏఐసీసీ ప్రకటించడంపై కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణ మూర్తి హర్షం వ్యక్తం చేశారు. పార్టీ కోసం శ్రమించిన జననేత రేవంత్‌రెడ్డి నాయకత్వాన ప్రజాస్వామిక తెలంగాణగా సమూలమైన మార్పులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

డీసీఎం వ్యాన్ బోల్తా..



స్టేషన్‌ఘన్‌పూర్: నియోజకవర్గంలోని ఉప్పుగల్లు నుంచి పత్తి సీడ్స్ లోడ్‌తో షోలాపూర్‌కు వెళ్తున్న డీసీఎం వ్యాన్ స్థానిక ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై అదుపుతప్పి బోల్తా పడిన సంఘటన మంగళవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పత్తిలోడ్‌తో వెళ్తున్న డీసీఎం వ్యాన్ అదుపుతప్పగా ఒక్కసారిగా ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై బోల్తా పడింది. కాగా, ఆ సమయంలో అక్కడ ఎవరూ లేక పోవడవంతో ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదని, డీసీఎం వ్యాన్ అదుపు తప్పి బోల్తాపడిందని స్థానిక పోలీసులు తెలిపారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

హసన్‌పర్తి : గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ మేనేజర్ రవి తెలిపారు. హనుమకొండ, వరంగల్, జనగాం, భూపాల్‌పల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లోని నిరుద్యోగ యువత శిక్షణ పొందడానికి అర్హులన్నారు. పుట్టగొడుగుల పెంపకంపై పదిరోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. 18 ఏళ్ల నుంచి 45 ఏళ్ల వయస్సు కలిగి, తెల్లరేషన్‌కార్డులు ఉన్న వారు శిక్షణకు అర్హులన్నారు. ఆసక్తిగల యువత రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, విద్యార్హత ధృవీకరణ పత్రాలతో పాటు నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఈనెల 10లోపు హసన్‌పర్తిలోని సంస్కృతి విహార్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 11 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని రవి తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కేయూ విద్యార్థి, ఎస్‌ఎఫ్‌ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ అన్నారు. మంగళవారం కేయూలోని కామన్ మెస్‌లోకి వెళ్లి భోజనాన్ని పరిశీలించారు. అలాగే విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ విద్యార్థులు కార్తీక్, సందీప్, రాజ్‌కుమార్, నిఖిల్ పాల్గొన్నారు.

మెట్టుగుట్టపై మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం

మడికొండ: కార్తీక మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం మడికొండలోని మెట్టురామలింగేశ్వరస్వామి ఆలయంలో మహాన్యాస రుద్రాభిషేకం నిర్వహించారు. కాజీపేట వాస్తవ్యులు శర్విరాల సోమేశ్వర్–స్వరూపరాణి దంపతులు సుమారు రూ.28 వేల విలువగల వెండి శఠగోపం, ప్లేటు సమర్పించారు. రామలయంలో సీతారామచంద్రస్వామి వారికి ప్రత్యేక అర్చనలు చేపట్టారు. సాయంకాలం సూర్యాస్తమయం అనంతరం స్వామివార్లకు ఆకాశదీపోత్సవం నిర్వహించారు. అనంతరం పలు సేవ కార్యక్రమాలు చేశారు. కార్యనిర్వహణాధికారి కె. శేషుభారతి, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, సత్యనారాయణశర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

8న సత్యనారాయణస్వామి వ్రతం

ఈనెల 8న సాముహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి శేషుభారతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే వారు దేవాలయ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ప్రజాభవన్‌గా మార్చడాన్ని స్వాగతిస్తున్నాం

హన్మకొండ: ప్రగతి భవన్‌ను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రజా భవన్‌గా మార్చడాన్ని స్వాగతిస్తున్నామని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్ కుమార్ తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో ప్రగతిభవన్ సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయిందని, దొరల గడీగా మారిందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రగతి భవన్‌ను ప్రజల ముందుకు తీసుకువస్తానని పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చెప్పడం సంతోషకరమన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో అణిచివేత, నిర్బంధాలు కొనసాగాయని, సంక్షేమ పథకాలు కొందరికే చేరాయని కొత్త ప్రభుత్వంలో ఇలాంటి వాటికి చోటు ఉండకూడదన్నారు. ఉద్యమకారుల, ప్రజా ఆకాంక్షల మేరకు పని చేయాలని కోరారు.

నిరుపయోగంగా హాస్టల్ భవనం

- తాటికొండలో రూ.లక్షలు వెచ్చించి లక్షణంగా వదిలేశారు
- శిథిలావస్థకు చేరుతున్న బిల్డింగ్
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



తాటికొండలో నిరుపయోగంగా ఉన్న హాస్టల్ భవనం

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలో ఎంతో ఘనమైన చరిత్ర ఉన్న తాటికొండలో ప్రభుత్వ ఎస్సీ బాలుర హాస్టల్ భవనం నిరుపయోగంగా మారి దాదాపు పదేళ్లు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు. ఎస్సీ స్టాండింగ్ కమిటీ చైర్మన్, ఘన్‌పూర్ జెడ్పీటీసీ సభ్యుడు మారపాక రవి స్వగ్రామమైన తాటికొండలో ప్రభుత్వ భవనం నిరుపయోగంగా మారి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోకపోవడం అధికారులు, ప్రజాప్రతినిధుల పట్టింపులేని తనానికి నిదర్శనంగా నిలుస్తుంది. మండల పరిషత్ వైస్ చైర్మన్ చల్లా సుధీర్‌రెడ్డి స్వగ్రామం కూడా తాటికొండ కావడం విశేషం. తాటికొండ తమ అమ్మమ్మగారి ఊరని, తాటికొండ అంటే ఎనలేని ఇష్టమని పలుమార్లు చెప్పే ఆ గ్రామం పేరునే తమ ఇంటిపేరుగా మార్చుకున్న తాజా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య సైతం ఈ అంశంపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం విడ్డూరంగా ఉంది. వివరాలు ఇలా ఉన్నాయి.

గతంలో తాటికొండతో పాటు తాటికొండ చుట్టుపక్కల గ్రామాల విద్యార్థులు హైస్కూల్ విద్యను తాటికొండలో చదువుకునే వారు. అయితే ఆరోజుల్లో తాటికొండలో హాస్టల్ లేకపోవడంతో ప్రతీ రోజూ విద్యార్థులు వివిధ గ్రామాల నుంచి ఇక్కడకు నడుచుకుంటూ వచ్చి చదువుకునే క్రమంలో రోజూ పాఠశాలకు వచ్చి వెళ్లేందుకు తీవ్ర అవస్థలకు గురయ్యేవారు. దాంతో విద్యార్థులు, తల్లిదండ్రుల కోరిక మేరకు అప్పటి టీడీపీ ప్రభుత్వంలో 1997లో తాటికొండలో సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతిగృహాన్ని లక్షలు వెచ్చించి నిర్మింపజేయించారు. తాటికొండ హాస్టల్‌లో స్టేషన్‌ఘన్‌పూర్ మండలం తాటికొండ, కొత్తపల్లి, జిట్టిగూడెం, ప్రస్తుత చిల్పూరు మండలం కృష్ణాజీగూడెం, పల్లగుట్ట, ఫత్తేపూర్, గార్లగడ్డతండా తదితర గ్రామాల విద్యార్థులకు ఎంతో సౌకర్యంగా మారింది. ఆయా గ్రామాల విద్యార్థులు ఇక్కడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకుంటూ తాటికొండ హాస్టల్‌లో ఉండేవారు. దాంతో విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

పదేళ్ల క్రితం మూతపడిన హాస్టల్..

మొదట్లో హాస్టల్ విద్యార్థులతో కళకళలాడేది. అయితే కాలక్రమేణా విద్యావ్యవస్థలో, సాంఘిక సంక్షేమ శాఖలో వచ్చిన మార్పులతో హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్య తగ్గింది. చుట్టుపక్కల గ్రామాల్లో పలు ప్రైవేట్ పాఠశాలలు ఏర్పాటు కావడం, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ అయ్యాయి. దాంతో హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. సాంఘిక సంక్షేమ శాఖలో వచ్చిన నూతన నిబంధనల మేరకు హాస్టల్‌లో నిర్దేశించిన సంఖ్య కన్నా తక్కువ విద్యార్థులున్న హాస్టళ్లను మూసివేశారు. హాస్టల్ ప్రారంభ సమయంలో 100 మంది విద్యార్థులు లక్ష్యంగా ఉండగా హాస్టల్‌లో 100కు పైగా విద్యార్థులుండేవారు. అయితే కాలక్రమేణా విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వచ్చింది. చివరకు హాస్టల్‌లో విద్యార్థులు 20 మందికి చేరుకోగా 2015 సంవత్సరం వరకూ కాస్త అటు ఇటుగా నడిచిన హాస్టల్ 2015లో పూర్తిగా మూతపడింది.

శిథిలావస్థవకు చేరుకున్న హాస్టల్ భవనం

దాదాపు పదేళ్ల క్రితం మూతపడిన హాస్టల్ భవనాన్ని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదు. దాంతో హాస్టల్ భవనం ఆవరణలో పెద్ద ఎత్తున పిచ్చిమొక్కలు పెరిగి శిథిలావస్థకు చేరింది. దానికి తోడు కొందరు స్థానికులు అందులోనే పశువులను కట్టేస్తుండగా పశువుల కొట్టంగా మారుతుంది. లక్షలు వెచ్చించి నిర్మించిన ప్రభుత్వ భవనం ఏళ్ల తరబడి నిరుపయోగంగా శిథిలావస్థకు చేరినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజల తీర్పును గౌరవించేలా పాటుపడాలి



సన్మానం పొందిన నాయకులతో లక్ష్మీనారాయణనాయక్

దేవరుప్పుల: బీఆర్ఎస్ ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ కాంగ్రెస్‌పై విశ్వాసంతో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించేలా క్షేత్రస్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాటుపడాలని టీపీసీసీ సభ్యుడు డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణనాయక్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు నల్ల శ్రీరాములు ఆధ్వర్యంలో ఆయా గ్రామాల పార్టీ బాధ్యుల సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ పక్షాన చట్టసభల్లో పాలకుర్తి నుంచి ప్రాతినిధ్యం లేని లోటును తీర్చేలా ఎమ్మెల్యేగా మామిడాల యశస్వినిరెడ్డిని గెలిపించడానికి దోహదపడిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, సబ్బండ వర్గాల ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు సురేష్‌బాబు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కాసారపు ధర్మారెడ్డి, రెడ్డిరాజుల రమేష్, శ్రీనివాసాచారీ. యూత్, బీసీ, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు బోనగిరి యాకస్వామి, గణేశ్, నాగరాజు, తోటకూరి పాండుకృష్ణ, ఈదునూరి వెంకట్‌రెడ్డి, చింతల రవీందర్‌రెడ్డి, బ్లాక్, మండల మహిళ విభాగం అధ్యక్షురాలు వడ్లకొండ తార, బాగాల మాలతి, సరస్వతీ, సైదుల్‌రెడ్డి, మల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న గణేశ్



పెద్దమదూరులో..

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తానేదార్‌పల్లికి చెందిన రాచర్ల రామయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మాచర్ల గణేశ్‌గౌడ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.8వేలు ఆర్థికసాయం మంగళవారం అందించారు. ఈ సందర్భంగా రాచర్ల మృతిపై ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. మాచర్ల రఘురాములు, కంసాని రాజిరెడ్డి, మంతెన ధర్మారెడ్డి, పురుషోత్తం, జనార్దన్‌రెడ్డి, రంజిత్ పాల్గొన్నారు.

పెద్దమదూరులో..

దేవరుప్పుల: మండలంలోని పెద్దమదూరులో గొడిశాల అచ్చయ్య మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ యువజన జిల్లా నాయకుడు బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్ సౌజన్యంతో కార్యకర్తలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు నల్ల ఉమేష్, గ్రామ అధ్యక్షుడు బండారి రాములు, ఎంపీటీసీ గిరి, సంపత్ తదితరులు ఉన్నారు.

‘పల్లా’ విజయంతో మొక్కుల చెల్లింపు



పూజ చేస్తున్న మహిళా నాయకులు

జనగామ: జనగామ ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ నుంచి పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజయం సాధించడంతో ఆ పార్టీ మహిళా నాయకులు దామెర మల్లికాంబ, బద్దోజు గంగాభవానీ మంగళవారం ఏపీలోని రాజమండ్రి ఉజ్జయిన మహంకాళేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. జనగామ నియోజక వర్గాన్ని ఇంతకు రెట్టింపు అభివృద్ధి చేసేలా పల్లాను ఆశీర్వదించాలని దేవుడిని వేడుకున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు



జనగామ చౌరస్తాలో సంబురాల్లో కాంగ్రెస్ నాయకులు



జనగామ: స్వీట్లు తినిపించుకుంటున్న నాయకులు

జనగామ: తెలంగాణ సీఎంగా రేవంత్‌రెడ్డిని ప్రకటించడాన్ని స్వాగతిస్తూ జనగామలో కాంగ్రెస్ శ్రేణులు మంగళవారం రాత్రి పెద్ద ఎత్తున సంబురాలు చేసుకున్నారు. నాయకులు ఎర్రమల్ల సుధాకర్, మేడ శ్రీనివాస్, చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, వంగాల కల్యాణి మల్లారెడ్డి, ఆలేటి సిద్దిరాములు, జాయ మల్లేశం, చెంచారపు బుచ్చిరెడ్డి, సమ్మయ్య తదితరుల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ చౌరస్తాలో బాణసంచా పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. తెలంగాణలో ప్రజాస్వామికి పాలన రాబోతుందని నినాదాలు చేశారు. కాగా, ఆ పార్టీ నాయకులు మోర్తాల ప్రభాకర్, వేముల మల్లేశం, సత్తయ్య, ప్రవీణ్, ఆండాలు మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ రుణం ప్రజలు తీర్చుకున్నారన్నారు. రేవంత్‌రెడ్డిని సీఎంగా ప్రకటించడం యావత్తు తెలంగాణ స్వాగతిస్తుందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు పాదయాత్ర చేసిన బట్టి విక్రమార్కకు ఉప ముఖ్యమంత్రి ఇవ్వాలన్నారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందని ఆపార్టీ జిల్లా నాయకుడు జంగిటి విద్యానాథ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. జనగామ నియోజకవర్గంలో ప్రజలు డబ్బు, ప్రలోభానికి మొగ్గు చూపారని, రాష్ట్రం మొత్తం కొత్త ప్రభుత్వ పాలనకు మార్పు కోరుకుందని తెలిపారు. జనగామలో నైతికంగా మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిదే విజయమన్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఐదేళ్ల పాటు ప్రజలు సుభిక్షంగా ఉండేలా సమర్థవంతమైన పాలన అందిస్తారని, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేస్తారని చెప్పారు. రేవంత్‌రెడ్డి సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత సంక్షేమ పథకాలకు శ్రీకారం చుడుతారని ప్రజలు, కార్యకర్తలు అధైర్యపడొద్దన్నారు. నాయకులు పాల్గొన్నారు.

కాలభైరవస్వామికి అయ్యప్ప స్వాముల పూజ



పూజ చేస్తున్న స్వాములు

కొడకండ్ల: మండలకేంద్రంలోని కాలభైరవ స్వామికి మంగళవారం అయ్యప్ప మాలధారణ స్వాములు పూజలు నిర్వహించారు. కాలభైరవ అష్టమిని పురస్కరించుకొని గురుస్వాములు శ్రీపాద ఆంజనేయ చారి, మేర్గు సోమేశ్వర్ ఆధ్వర్యంలో స్వాములంతా ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. స్వాములు మల్లయ్య, దయానంద్, రాజు, యాకయ్య, అనీల్, సతీష్‌గౌడ్, సతీష్, మధు, శ్రీను ఉన్నారు.

పాగాల సంపత్‌రెడ్డికి ఘన నివాళి



జఫర్‌గఢ్: నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ బేబి



బచ్చన్నపేట: నివాళులర్పిస్తున్న రమణారెడ్డి



సంపత్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ కళింగరాజు

జఫర్‌గఢ్: గుండెపోటుతో సోమవారం మృతి చెందిన జెడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు పాగాల సంపత్‌రెడ్డికి జెడ్పీటీసీ సభ్యురాలు ఇల్లందుల బేబి శ్రీనివాస్ మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. చిల్పూరు మండలంలోని రాజవరంలో సంపత్‌రెడ్డి మృతదేహాన్ని ఆమె సందర్శించి సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుడు, జెడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డి అకస్మికం మృతి చెందడం బాధాకరమన్నారు. ఆయన మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరనిలోటన్నారు. ఆమె వెంట మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

బచ్చన్నపేట: గుండెపోటుతో మృతి చెందిన పాగాల సంపత్‌రెడ్డి కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులు పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పాగాల స్వగ్రామం చిల్పూర్‌కు వెళ్లి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొడిగం చెంద్రారెడ్డి, నక్కల పిట్టల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాలియా చిట్టిబాబు, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు దూడల కనుకయ్య, నాయకులు వడ్డెపల్లి ఉపేందర్ రెడ్డి, గంధమల్ల నరేందర్, షబ్బీర్, జావీద్ ఉన్నారు.

జనగామ రూరల్: జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి గుండె పోటుతో సోమవారం మృతి చెందారు. కాగా, ఎంపీపీ మేకల కళింగరాజు, జెడ్పీ సీఈఓ వసంత ఎంపీడీఓ హసీం ఆయన చిత్రపటానికి పూల మాల వేసి మంగళవారం నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్మన్ ఆకస్మిక మృతి బాధాకరం

కొడకండ్ల: జనగామ జిల్లా పరిషత్ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి ఆకస్మిక మృతి బాధాకరమని ఎంపీపీ జ్యోతి, జెడ్పీటీసీ కేలోత్ సత్తమ్మలు అన్నారు. అందరిని ప్రేమగా పలుకరిస్తూ సమన్వయం చేస్తూ జిల్లా అభివృద్ధితో పాటు బీఆర్ఎస్ అభివృద్ధికి కృషి చేశాడన్నారు. మంచి వ్యక్తిత్వం కలిగిన నాయకుడిని కోల్పోవడం విచారంగా ఉందని ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ కుటుంబసభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని కల్పించాలని వారు కోరారు.

ఇంటి, నల్లా పన్నులు చెల్లించాలి



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న రఘురామకృష్ణ

బచ్చన్నపేట: గ్రామస్తులు 2023 డిసెంబర్ 24కి సంబంధించిన ఇంటి, నల్లా పన్నులు చెల్లించాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలు స్వచ్ఛందంగా పన్నులను చెల్లించి గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. అలాగే పన్నుల వసూళ్లకు వచ్చే పంచాయతీ కార్యదర్శులకు, సిబ్బందికి ప్రజలు సహకరించాలన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలకు జీపీ సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలో సమర్థవంతమైన పాలన



మాణిక్‌రావు ఠాక్రేతో ఉపేందర్‌రెడ్డి

బచ్చన్నపేట: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో సమర్థవంతమైన పాలన అందుతుందని ఆ పార్టీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ చల్ల ఉపేందర్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో ఏఐసీసీ నేత మాణిక్‌రావు ఠాక్రేను ఆయన మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికి కాబోవు నూతన సీఎం అనుముల రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. గత కుటుంబ పాలనకు ప్రజలు చరమగీతం పాడి మార్పును కోరుకున్నారని తెలిపారు. రాష్ట్రంలో చాలా స్థానాల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించిన ప్రజలు జనగామ నియోజకవర్గంలో డబ్బు, ప్రలోభాలకు లొంగారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ అభివృద్ధికి పాటు పడుతారని చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరుగ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తామని హామీ ఇచ్చారు.

విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపునకు కృషి



మాట్లాడుతున్న నోడల్ అధికారి రాజేందర్

జనగామ రూరల్: విద్యార్థుల్లో అన్ని రకాల సామర్థ్యాల పెంపునకు పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల నోడల్ అధికారి వంగాల రాజేందర్ సూచించారు. పట్టణంలోని ధర్మకంచ పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు నూతన పద్ధతులతో విద్యార్థులకు సులభతరంగా బోధన చేయాలన్నారు. తరగతిలో బోధన అభ్యసన సామర్థ్యాల్లో ఎదుర్కొంటున్న సమస్యలు, లోటు పాట్లపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రావు, వెంకటేశ్వర్లు, ఉప్పలయ్య, రిసోర్స్ పర్సన్లు వీర నర్సయ్య, మురళి, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముసురుతో అన్నదాతల అవస్థలు



పాలకుర్తి: ముత్తారంలో ధాన్యం బస్తాలపై కవర్లు కప్పిన రైతులు

దేవరుప్పుల: మండల వ్యాప్తంగా తుపాన్ ప్రభావంతో ఎడతెరిపిలేని ముసురుతో కోతకు వచ్చిన వరిపంట చేతికొచ్చుడు కష్టమని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే 76 శాతం వరి పంట దిగుమతి అయినప్పటికీ మిగితా 25 శాతం చెరువు ఆయకట్టు కింద సాగుచేసిన అన్నదాతలకు ధాన్యం దిగుమతి కష్టంగా మారనుంది. ప్రకృతి వైపరీత్యాలతో నష్టం వాటిల్లే రైతులకు ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం

పాలకుర్తి: తుపాన్ ప్రభావంతో మంగళవారం కురిసిన చిరుజల్లులకు మండలంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో–7, సహకార సొసైటీల ద్వారా–8 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 70 శాతం ధాన్యం కొనుగోలు పూర్తయింది. అకాలం వర్షంతో ధాన్యం బస్తాలపై రైతులు కవర్లు కప్పారు. అయినా ధాన్యం తడిసిపోయింది.

తుపాన్ ప్రభావంతో బయటకు రాని జనం

బచ్చన్నపేట: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో మంగళవారం ఉదయం నుంచి కురుస్తున్న చిరుజల్లులతో మండలంలోని అన్ని గ్రామాల్లోని వీధులు నిర్మానుష్యంగా మారాయి. ప్రజలెవరూ బయటికి రాకపోవడంతో వీధులన్నీ బోసిపోయాయి. జిల్లాకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ ప్రకటించడంతో ప్రజలు బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన వాన పడుతూ గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో కూలీలు సైతం ఇంటి పట్టునే ఉన్నారు. వర్షాలకు రైతులు తమ వ్యవసాయ బావుల వద్ద ట్రాక్టర్లతో దుక్కులు దున్నిస్తున్నారు.